AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN


09-03-2026 (Monday) MAIN EDITION

## తెలంగాణకు వర్ష సూచన



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండుతున్నాయి. భానుడు భగభగ మండుతున్నాడు. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటేనే ఆలోచిస్తున్నారు. ఈ తరుణంలో రాష్ట్రానికి భారీ వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మార్చి 16 నుంచి 23 వరకు భారీ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. అక్కడక్కడ వడగళ్లు సైతం పడతాయి. కొన్ని ప్రాంతాల్లో రెండు నుంచి మూడు రోజుల పాటు సైతం వర్షాలు పడే అవకాశం ఉంది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. ముఖ్యంగా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## చమురు ధరలు తగ్గుతాయి : ట్రంప్



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** చమురు ధరల పెరుగుదలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పరిణామాల దృష్ట్యా చమురు ధరలు పెరుగుతున్నాయని ట్వీట్ చేశారు. కానీ ఇది స్వల్పకాలికమేనని అమెరికా అధ్యక్షుడు పేర్కొన్నారు. ఇరాన్ అణు ముప్పు తొలగిన అనంతరం అవి పడిపోతాయని 'ట్రూత్'లో పోస్ట్ చేశారు. కాగా.. సోమవారం చమురు ధరలు దాదాపు 20 శాతం పెరిగాయి. జూలై 2022 తర్వాత వాటి గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. ప్రస్తుతం బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర 100 డాలర్లకు చేరుకుంది.

## తాడేపల్లి రిటైనింగ్ వాల్‌కు శంకుస్థాపన



**అక్షరటుడే, ఏపీ:** మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి మహానాడు ప్రాంత ప్రజల కలను మంత్రి నారా లోకేశ్ నెరవేర్చారు. తాడేపల్లిలోని సీతానగరం మహానాడు వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కృష్ణా నదికి ప్రకాశం బ్యారేజీ దిగువన కుడి వైపు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.294.20 కోట్లతో పనులు చేపట్టేందుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

## తాగునీటి సరఫరాలో అంతరాయం



**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో పైప్ లైన్ ధ్వంసం కావడంతో పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో జల మండలి అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నారు. నగరంలోని బుల్కాపూర్ వద్ద పైప్ లైన్ ధ్వంసమైంది. దీంతో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు.

## విజయ్‌కి సీబీఐ నోటీసులు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** టీవీకే పార్టీ అధినేత, హీరో విజయ్‌కి మరోసారి సీబీఐ నోటీసులు జారీ చేసింది. కరూర్ తొక్కిసలాట ఘటనలో మంగళవారం విచారణకు రావాలని పేర్కొంది. ఈ కేసులో ఇప్పటికే రెండు సార్లు ఢిల్లీలో సీబీఐ విచారణకు విజయ్ హాజరయ్యారు. జనవరి 12, 19 తేదీల్లోనూ ఆయన విచారణకు హాజరయ్యారు.



## ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో 23 మందికి నోటీసులు

**అక్షరటుడే, ఢిల్లీ:** ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కీలక పరిణామా చోటు చేసుకుంది. ఢిల్లీ హైకోర్టు సోమవారం మాజీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితతో సహా మరో 23 మందికి సీబీఐ దాఖలు చేసిన అప్పీల్‌పై నోటీసులు జారీ చేసింది. కేసులో నిందితులకు రౌస్ ఎవెన్యూ కోర్టు ఇటీవల క్లీన్ చిట్ ఇవ్వగా.. సీబీఐ ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు నేడు విచారణ చేపట్టింది. దర్యాప్తు సంస్థపై ప్రత్యేక కోర్టు చేసిన వ్యాఖ్యలపై హైకోర్టు స్టే విధించింది. ఈడీ కేసు విచారణ వాయిదా వేయాలని ట్రయల్ కోర్టుకు సూచించింది. అలాగే తదుపరి విచారణ వారం రోజులు వాయిదా వేసింది. వచ్చే సోమవారం విచారణ జరగనుంది. కాగా.. సీబీఐ తరపున సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.

## హైదరాబాద్‌లో కారు బీభత్సం

**అక్షరటుడే, హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లాలోని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక స్కోడా కారు ఒక బైక్‌ను ఢీకొట్టి దాదాపు 2 కిలోమీటర్ల దూరం ఈడ్చుకెళ్లింది. పల్లెచెరువు నుంచి చంద్రాయణగుట్ట వైపు వెళ్లే దారిలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు, అతను మద్యం మత్తులో ఉన్నట్లు తేలింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**దలాల్ స్ట్రీట్‌లో మరో బ్లాక్ మండే నమోదైంది. జియో పొలిటికల్ టెన్షన్స్ నేపథ్యంలో క్రూడ్ ఆయిల్ ధరలు స్టాక్ మార్కెట్‌కు షాక్ ఇవ్వడంతో సూచీలు భారీగా పతనమయ్యాయి. ఇంట్రాడేలో 30 శాతానికిపైగా పెరిగి బ్యారెల్‌కు 117 డాలర్లకు చేరిన క్రూడ్ ఆయిల్ ధర.. ఆ తర్వాత శాంతించి 104 వద్ద స్థిరపడింది. దీంతో చివరి గంటలో మార్కెట్ కోలుకుని ఇన్వెస్టర్లకు స్వల్ప ఊరటనిచ్చింది.**

**—అక్షరటుడే, బిజినెస్ డెస్క్**



# దలాల్ స్ట్రీట్‌లో బ్లాక్ మండే!

- కల్లోలం సృష్టించిన క్రూడ్ ఆయిల్ ధర
- ప్రారంభంలో భారీగా పతనమైన సూచీలు
- చివరి గంటలో కొనుగోళ్ల మద్దతుతో స్వల్ప ఊరట

**2024 తర్వాత ఇంట్రాడేలో అతిపెద్ద పతనం..**

దేశీయ స్టాక్ మార్కెట్లు 2024 జూన్ 4 తర్వాత పాయింట్ల పరంగా రెండో అతిపెద్ద పతనాన్ని నమోదు చేశాయి. అప్పట్లో ప్రధాన సూచీలు 5.7 శాతం నష్టపోయాయి. లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి సంపూర్ణ మెజారిటీ రాకపోవడంతో సెన్సెక్స్ 4,390 పాయింట్లు, నిఫ్టీ 1,380 పాయింట్లు పడిపోయాయి. సోమవారం ఇంట్రాడేలో సెన్సెక్స్ 2,494 పాయింట్లు, నిఫ్టీ 753 పాయింట్లు కోల్పోయాయి.

పశ్చిమాసియాలో పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఆందోళన కలిగిస్తున్నాయి. అమెరికా, ఇరాన్‌ల మధ్య యుద్ధం ఇప్పట్లో ముగిసే అవకాశాలు కనిపించడం లేదు. మరోవైపు ఇరాన్ కీలకమైన హార్ముజ్ జలసంధిని మూసి వేయడంతో చమురు సరఫరా వ్యవస్థకు ఆటంకాలు ఏర్పడ్డాయి. పలు దేశాలు ముడి చమురు ఉత్పత్తిని నిలిపివేయడంతో క్రూడ్ ఆయిల్ ధరలకు రెక్కలొచ్చాయి. ఈ క్రమంలో ముడి చమురు ధర ఒక్కసారిగా ఆకాశన్నంటింది. ఇంట్రాడేలో బ్యారెల్‌కు గరిష్టంగా 119.14 డాలర్లకు చేరింది. 2022 తర్వాత ఇదే అత్యధికం. బ్యారెల్‌కు 150 డాలర్ల వరకు పెరిగే అవకాశాలున్నాయన్న భయాలతో ఇన్వెస్టర్లు ఒత్తిడికి గురయ్యారు. దీంతోపాటు క్రూడ్ ఆయిల్ ధర పెరుగుతుండడం, రూపాయి విలువ పతనమవుతుండడం, విదేశీ సంస్థాగత మదుపరులు పెట్టుబడులు ఉపసంహరిస్తూనే ఉండడంతో మన మార్కెట్లు పతనమయ్యాయి.

**భారీ నష్టాలతో ప్రారంభమై..**

దేశీయ స్టాక్ మార్కెట్ సోమవారం భారీ నష్టాలతో ప్రారంభమైంది. సెన్సెక్స్ 1,862 పాయింట్ల నష్టంతో ప్రారంభమై మరో 632 పాయింట్లు పతనమైంది. నిఫ్టీ 582 పాయింట్ల నష్టంతో ప్రారంభమై మరో 171 పాయింట్లు కోల్పోయింది. మధ్యాహ్నం 2.30 గంటల వరకు మార్కెట్లు భారీ నష్టాలతో సాగాయి. అయితే చమురు ధరలను నియంత్రించేందుకు జీ7 దేశాలు చర్యలు తీసుకుంటున్నాయన్న వార్తలతో మార్కెట్లు కోలుకున్నాయి. వ్యూహాత్మక నిల్వలనుంచి 400 మిలియన్ బ్యారెళ్లను విడుదల చేసే విషయాన్ని జీ7 దేశాలు పరిశీలిస్తున్నాయని ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొంది. దీంతో క్రూడ్ ఆయిల్ ధర కాస్త శాంతించింది. చివరికి బ్యారెల్‌కు 104.70 డాలర్ల వద్ద స్థిరపడింది. దీంతో సూచీలు కోలుకున్నాయి. ఇంట్రాడే కనిష్టాల నుంచి సెన్సెక్స్ 1,287 పాయింట్లు, నిఫ్టీ 381 పాయింట్లు పెరిగాయి. చివరికి సెన్సెక్స్ 1,352 పాయింట్ల నష్టంతో 77,566 వద్ద, నిఫ్టీ 422 పాయింట్ల నష్టంతో 24,028 వద్ద స్థిరపడ్డాయి.

**ప్రపంచ వ్యాప్తంగా ఇదే పరిస్థితి..**

అమెరికా, ఇరాన్‌ల మధ్య యుద్ధం, క్రూడ్ ఆయిల్ ధరలు సృష్టిస్తున్న కల్లోలంతో గ్లోబల్ మార్కెట్లన్నీ నష్టాల బాటలోనే పయనిస్తున్నాయి. అత్యధికంగా సౌత్ కొరియాకు చెందిన కోస్పీ 6.34 శాతం పతనమవగా.. జపాన్ నిక్కీ 5.48 శాతం, తైవాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ 4.64 శాతం, సింగపూర్‌కు చెందిన స్ట్రెయిట్ టైమ్స్ 1.93 శాతం నష్టంతో ఉన్నాయి.

## రామగుండం ఎన్టీపీసీ రెండో దశను వేగవంతం చేయాలి: కిషన్ రెడ్డి



**అక్షరటుడే, హైదరాబాద్:** రామగుండం ఎన్టీపీసీ రెండో దశ ప్రాజెక్టును వేగవంతం చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. తెలంగాణలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. తెలంగాణలో విద్యుత్ డిమాండ్ మునుపెన్నడూ లేనివిధంగా 18,139 మెగావాట్లకు చేరుకుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ అవసరాలు మరింత పెరుగుతాయని, రాష్ట్ర గ్రిడ్ స్థిరత్వం కోసం మరికొంత థర్మల్ విద్యుత్ ఉత్పత్తి పెంచాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈ నేపథ్యంలో, ఆధునికమైన 'అల్ట్రా సూపర్ క్రిటికల్' సాంకేతికతతో తక్కువ ఖర్చుకే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న ఎన్టీపీసీ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రాజెక్టు విషయంలో సానుకూలంగా స్పందించాలని కోరారు.

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై మంత్రి జైశంకర్ ప్రకటన



**అక్షరటుడే, ఢిల్లీ:** పశ్చిమాసియాలో జరుగుతున్న పరిణామాలపై సోమవారం విదేశాంగ మంత్రి జైశంకర్ మాట్లాడుతూ.. భారత్ శాంతి, సంభాషణ దౌత్యానికి అనుకూలంగా ఉందన్నారు. భారతదేశం ఉద్రిక్తతలను తగ్గించడం, సంయమనం పాటించడం, పౌరుల భద్రతను నిర్ధారించడం కూడా సమర్థిస్తుందన్నారు. రాజ్యసభ, లోక్‌సభలో సోమవారం జైశంకర్ మాట్లాడారు. పశ్చిమాసియాలో జరుగుతున్న పరిణామాలు మనందరికీ తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అన్ని సమస్యలను పరిష్కరించడానికి ఆయా దేశాలతో చర్చిస్తుందన్నారు. ఈ ప్రాంతంలోని అన్ని రాష్ట్రాల సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను గౌరవించడం కూడా అత్యవసరమన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పశ్చిమాసియాలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తూనే ఉన్నారని విదేశాంగ మంత్రి అన్నారు. ఇంధన భద్రత, చమురు, గ్యాస్ సరఫరాకు ఈ ప్రాంతం ముఖ్యమైనదని చెప్పారు.

## శంషాబాద్ విమానాశ్రయంలో భారీగా గంజాయి పట్టివేత



**అక్షరటుడే, హైదరాబాద్:** అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినా ఎయిర్‌పోర్టుల అక్రమ రవాణాలు ఆగడం లేదు. తాజాగా.. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా గంజాయి పట్టుబడింది. కౌలాలంపూర్ నుంచి వచ్చిన ఇద్దరు ప్రయాణికులను తనిఖీ చేయగా.. వారి వద్ద రూ.3 కోట్ల విలువైన తొమ్మిది కిలోల గంజాయిని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వారు తరలిస్తున్న హైడ్రోపోనిక్ గంజాయిని సీజ్ చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారిని విచారిస్తున్నారు.

## చిల్లర కామెంట్లకు త్రిష కౌంటర్..

**సీనియర్ బ్యూటీ త్రిష చేసిన లేటెస్ట్ ట్వీట్.. ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన పోస్ట్‌లో త్రిష.. ఎక్కడా ఎవరు ప్రస్తావించకపోయినా రీసెంట్‌గా ఆమెపై చిల్లర కామెంట్లు చేసిన డైరెక్టర్ కమ్ యాక్టర్ పార్తీబన్‌కు కౌంటర్ ఇచ్చినట్లు అర్థమవుతోంది. ఇటీవల జరిగిన ఓ అవార్డు వేడుకలో ఆయన చేసిన వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో త్రిష ఘాటుగా రెస్పాండ్ అయినట్లు తెలుస్తోంది.**

**—అక్షరటుడే, సినిమాడెస్క్**



## టీటీడీకి వెళ్తున్న నెయ్యి ట్యాంకర్ బోల్తా..



**అక్షరటుడే, ఏపీ:** కడప జిల్లాలో తిరుమల తిరుపతి దేవస్థానం కోసం నెయ్యి తీసుకెళ్తున్న ట్యాంకర్ బోల్తా పడింది. జమ్మలమడుగు నియోజకవర్గంలోని కొండాపురం మండలం చిత్రావతి వంతెన సమీపంలో ఈ సంఘటన జరిగింది. పూణే నుంచి తిరుమలకు వెళ్తున్న నెయ్యి ట్యాంకర్ ఒక్కసారిగా అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంతో ట్యాంకర్‌లోని నెయ్యి బయటకు కారడం ప్రారంభమైంది. ఈ విషయం తెలిసిన వెంటనే పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. బిందెలు, బకెట్లు, చెంబులు, వాటర్ బాటిల్స్ చేతికి దొరికిన ప్రతి వస్తువుతో నెయ్యి తీసుకెళ్లారు.

## ఇరాన్ సుప్రీమ్‌గా ఖమేనీ కొడుకు మొజ్తాబా



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** మొజ్తాబా ఖమేనీ సుప్రీం నాయకుడిగా ఎన్నికయ్యారు. ఇదే సమయంలో టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ బాంబు దాడి చేసింది. ఇక ట్రంప్ హెచ్చరిక తర్వాత కొన్ని గంటల్లోనే ఖమేనీ కుమారుడు మొజ్తాబా ఇరాన్ కొత్త సుప్రీం నాయకుడిగా ఎంపికయ్యారు. "నిర్ణయాత్మక ఓటింగ్ ద్వారా, నిపుణుల అసెంబ్లీ అయతుల్లా సెయ్యద్ మొజ్తాబా హొస్సేనీ ఖమేనీని ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ పవిత్ర వ్యవస్థకు మూడో నాయకుడిగా నియమించింది" అని టెహ్రాన్ అర్ధరాత్రి తర్వాత విడుదల చేసిన ఒక ప్రకటనలో అసెంబ్లీ ప్రకటించింది.